# కడిగిన ముత్యం



"కట్టవలసిన డబ్బంతా కట్టేశాను నాన్నా! అన్ని ఫార్మాలిటీస్ పూర్తిచేశాను. మీకు అభ్యంతరం లేకపోతే నేను... నేను వెళ్తాను" కార్తీక్ మాటలకు గాజు కళ్లతో నిస్తేజంగా చూస్తుండిపోయారు జగన్నాథంగారు.

"ఒరేయ్ బాబూ! బాగా వెలుతురు వచ్చే రూమ్ యిచ్చేలా చూడరా! నువ్వెళ్లిపోతే మళ్లీ వాళ్ల చుట్టూ తిప్పుకుంటారు. గాలి లేకపోతే నాకసలు నిద్రేపట్టదు" అన్నారాయన కొడుకు చేతులను తన చేతుల్లోకి తీసుకొంటూ.

సున్నితంగా విడిపించుకున్నాడు కార్తీక్. ఎంత వద్దనుకున్నా అతని ముఖంలో విసుగు కొట్టొచ్చినట్టు కన్పిస్తోంది.

"రూమ్‌లంటూ ఉండవంట నాన్నా! అందరూ హాల్లోనే పడుకోవాలట. అయినా రెండురోజులకోసారి నేనో, మీ కోడలో వచ్చి చూస్తూనే ఉంటాం. మీరేం కంగారుపడకండి. వస్తాను. ఆఫీసులో పర్మిషన్ టైం అయిపోతే మళ్లీ బాస్‌చేత మాటలు పడాల్సి వస్తుంది. వెళ్ళొస్తాను."

తండ్రిని ఆయనకు కేటాయించిన చేసిన కాట్ దగ్గరకు తీసుకువచ్చి కూర్చోపెట్టి అన్ని సరిగా ఉన్నాయో లేదో ఒకసారి చూసి, వెళ్లడానికి ఉద్యుక్తుడయ్యాడు కార్తీక్!

"బాబూ!" బావురుమన్నారు జగన్నాథంగారు.

"తప్పు నాన్నా. మీరే ఇలా బాధపడితే ఎలా? అటు మీ కోడలు ఉద్యోగం, ఇటు నా ఉద్యోగం, ఓ పక్క పిల్లల కాన్వెంట్ చదువులు. కౌలుకి ఇచ్చిన పొలం వ్యవహారాలు చూసుకోవడం. వీటన్నిటితో మిమ్మల్ని సరిగ్గా చూడలేక ఇలా చెయ్యాల్సివస్తోంది గానీ లేకుంటే మిమ్మల్ని ఇక్కడ వదిలి వెళ్లాల్సిన అవసరం ఏముంది నాన్నా?" పైకి అంటున్నాడే గానీ గొంతులోంచి వచ్చిన తన మాటలు తనకే పేలవంగా అనిపించాయి కార్తీక్‌కి. అందులో నిజం ఎంతో తనకు తెలుసు!

"సరే బాబూ! నీ కోసం ఈ కళ్లు అనుక్షణం ఎదురుచూస్తుంటాయని మర్చిపోకు. జాగ్రత్త! మనవలను అడిగానని చెప్పు!" ఒక్కొక్కమాట అతికష్టం మీద కూడగట్టుకుని అంటున్న తండ్రిని చూస్తే ఒక్కక్షణం జాలేసింది కార్తీక్‌కి. కానీ తప్పదు. కిరణ్మయితో పడలేం. కళ్లు చమర్చగా తండ్రిని వదిలి వడివడిగా ముందుకు కదలిపోయాడు కార్తీక్!

అప్పుడు పడింది ఆయన భుజం

మీద ఓ చెయ్యి ఓదార్పుగా!

నెమ్మదిగా తలెత్తి చూశారు జగన్నాథంగారు.

"నమస్తే! నాపేరు ప్రకాశం! మన వయసులో ఈ హోమ్‌కి వచ్చిన వాళ్లందరూ ముందు ఇలా బాధపడినవారే. జీవిత చరమాంకంలో ఉన్నాం. ఈ వయసులో మీరు కన్నీరు పెట్టటం నాకు చాలా బాధగా ఉంది. ఇంతకన్నా ఎన్నో సుడిగుండాలను మీరు ఇంతకు ముందు వయసులోనే దాటుకుని ఉంటారు. కోశస్థదశ విడిచి సీతాకోకచిలుకలా స్వేచ్ఛగా ఎగిరిపోయే దశకు చేరుకున్న వాళ్ళం. మీరు ధైర్యంగా ఉండాలి. అదే మనకు మిగిలిన ఆరోగ్యాన్ని నిలబడేలా చేస్తుంది. ఏమంటారు?"

ఆయనకి అరవైయ్యేడేళ్లకు పైనే ఉంటాయి. ఆత్మీయుడిలా చెబుతున్న ఆయన మాటలకు, గంభీరవదనుడై, భుజం మీద పడిన చేతిని ఆసరాగా తీసుకొని, లేచి నిలబడి శ్రీరాముడు ఆంజనేయస్వామిని కౌగిలించుకున్న రీతిలో ప్రకాశంగారిని కౌగిలించుకున్నారు జగన్నాథంగారు.

"నాపేరు జగన్నాథం".

అంటూ తనను పరిచయం చేసుకున్న కొద్దిసేపటికే వారిద్దరూ, కాలం తెలియని తమ జీవితానుభవ పుటల్లో ప్రతీ పేజీనీ చదువుకుంటూ ఆప్తులైపోయారు.

★★★

ప్రకాశంగారి సహచర్యంలో ఎంతో అత్యద్భుత క్షణాల్లా నెలరోజులు ఇట్టే గడిచిపోయాయి జగన్నాథంగారికి. ఈ నెలరోజుల్లో కార్తీక్‌గాని, కిరణ్మయిగాని ఇటు తొంగిచూడలేదు సరికదా, కనీసం కాకితో కబురైనా పంపలేదు జగన్నాథంగారు ఎలా ఉన్నారని?

"చూశావా ప్రకాశం! ఆనాడు నన్ను ఇక్కడ చేర్పిస్తూ కనీసం రెండు రోజులకొకసారైనా వచ్చి చూసి వెళ్తానని అన్న నా కొడుకు కనీసం నెలరోజులైనా రాలేదు. ఇక్కడ నాకంటూ నీ తోడు దొరకకపోయి ఉంటే నేనేమై పోదును?'' అన్నారు జగన్నాథంగారు ప్రకాశంతో.

"చివురు వేసిన కొమ్మను చూస్తే కలిగే ఆనందం పండిపోతున్న ఆకును చూస్తే కలుగదు జగన్నాథం! అయినా వాళ్ళు రావాలనుకోవటం కూడా మన పొరపాటే. వాళ్ల వాళ్ల పనుల్లో, వాళ్ల బిడ్డల సంరక్షణ పనుల్లో, వాళ్ళు బిజీగా ఉంటారు. మన వయసు వారికి వస్తే గానీ వారికి తెలియదు మన బాధ. మనలాంటి వారికి యిలాంటి ఆశ్రమాలైనా ఉన్నాయి. ఇదీ లేని వారితో పోలిస్తే మనం చాలా అదృష్టవంతులం జగన్నాథం!'' ప్రకాశం గారి మాటలు పూర్తికాకుండానే ఆయన కొడుకు, కోడలు, మనవలు వచ్చారు. వారు వచ్చిన ఆనందంతో, పాలు కడుపునిండా తాగి ఆడుకుంటున్న పసిపాపే అయిపోయారు ప్రకాశంగారు.

కొడుకును, కోడల్నీ జగన్నాథం గారిని పరిచయం చేశారు. వాళ్లు "అంకుల్! బాగున్నారా. మానాన్నగారిని జాగ్రత్తగా చూస్తూ ఉండండి!" అంటూ అప్యాయంగా పలకరించడంతో నగం బాధను మరిచిపోయారు జగన్నాథంగారు.

రకరకాల పండ్లు, పలాలూ, మినుపసున్ని, రవ్వలడ్డు మొదలైన స్వీట్లు తెచ్చిచ్చారు. "ఈ మధ్యనే షుగర్ తగ్గుముఖం పట్టిందిరా అబ్బాయి! మళ్లీ ఇవి తింటే ఎక్కువ అవుతుంది!" అని పండ్లు తీసుకొని స్వీట్స్ వెనక్కు తిరిగి ఇచ్చేశారు ప్రకాశంగారు.

వాళ్లు ఉన్నంతసేపూ వాళ్లలో తన కొడుకు, కోడలు మనుమలని చూసు కోవడంవల్ల కాబోలు జగన్నాథంగారు చాలా ఉత్సాహంగా ఫీలయ్యారు.

వాళ్లు వెళ్లిపోయారు.

ఆరోజే జగన్నాథంగార్కి ఓ ఉత్తరం అందింది. అదైనా కొడుకు నుంచే మోననుకున్నారు. కాన్వెంట్ నుంచి పెద్ద మనవడు వ్రాసింది.

"తాతయ్యా!

మేము అంతా బాగున్నాం. మీరు ఎలా ఉన్నారు? నెల రోజులనుంచీ మీరు సోమ, బుధ, శుక్రవారాలలో క్రమంగా తప్పకుండా వ్రాస్తున్న ఉత్తరాలు అన్నీ అందాయి. లైఫ్‌లో ఏదైనా గోల్ పెట్టుకొని చదవమన్నారు. నాకు ఎయిర్‌ఫోర్స్ పైలట్‌ను అవ్వాలనుంది. మీరు వ్రాసిన ప్రతీ ఉత్తరం నాకు నూతన ఉత్తేజాన్ని కలిగిస్తోంది. నాన్నగారి విషయంలో మీరు చేసిన పొరపాటును మాద్వారా దిద్దుకుంటున్నట్లు వ్రాశారు. అదే అర్థంకాలేదు. మొన్న రాజాజీ వ్రాసిన రామాయణం చదివాను. ఎంతో సున్నితమైన భావాన్ని సరళమైన ఇంగ్లీషులో ఆ మహనీయుడు రచించిన తీరుకు చదువుతున్నంతసేపు నాకు ఒళ్లు పులకరించింది. చెస్‌లో మొన్న జోనల్ లెవల్‌లో విన్నర్ అయ్యాను. చెస్ పట్ల నాకున్న అయిష్టతను పోగొట్టి అభిరుచిని పెంచి ఈ వేళ విన్నర్ స్థాయికి పెంచగలిగిన ఘనత మీదే. మీ ఆరోగ్యం జాగ్రత్త. సకల సంపదలూ మనకు ఉండి కూడా మీరు మాకు దూరంగా ఉన్నారనుకుంటే చాలా బాధ కలుగుతోంది. మీరు దగ్గరే ఉంటే ఇంకా మరెన్నో విషయాలు తెలుసుకునే అవకాశం లభించేది. అమ్మకు ఖాళీ ఉండదు. తమ్ముడు కూడా బాగా చదువుతున్నాడు. మీ ఆరోగ్యం జాగ్రత్త. ఉంటాను. నేను రిప్లై ఇవ్వలేదని మీరు వ్రాయడం మానకండి. మీరు వ్రాసే లెటర్స్ చదువుతుంటే నెహ్రూగారు ఇందిరాగాంధీ గార్కి వ్రాసిన "లెటర్స్ టు హిజ్ డాటర్" పుస్తకం గుర్తుకు వస్తోంది. మళ్లీ తొందరలో లెటర్ వ్రాస్తాను. నమస్కృతులతో... మీ పెద్ద మనవడు శ్రీ హర్ష".

ఆ ఉత్తరం మనవడి నుంచి వచ్చిన మూడో ఉత్తరం. ఈ నెలరోజుల్లో వచ్చిన ఆ మూడు ఉత్తరాలే తన ఎడారి జీవితానికి

ఒయాసిస్సులు... ఎండిన నేలకు తొలకరివానలు. అపురూపంగా ఆ ఉత్తరాన్ని ముద్దు పెట్టుకొని దాచుకుంటుంటే ప్రకాశంగారు నవ్వారు.

"చూశావా జగన్నాథం! సంతృప్తిని కలిగించే అంత చిన్న వస్తువు చాలు మనకు ఈ వయసులో - అన్న విషయం ఈ పిల్లలు గుర్తించేదెప్పుడో!"

"అందుకేగా ప్రకాశం! నేను రైల్వే టి.టిగా పనిచేసినప్పుడు దొరకని ప్రశాంతతని అంతటినీ పోగేసి, ఎన్నో ప్రదేశాలు తిరిగిన నా అనుభవాలన్నిటిని కలబోసి ఇప్పుడు కాగితం మీద పెట్టగలుగుతున్నాను. ఆ చిన్న కాగితాన్ని ఓ ప్రధాన గ్రంథమంతగా చేసుకొని ఎదుగుతున్న మనవడిని చూస్తుంటే మరింత ఉత్సాహం పుంజుకొస్తోందోయ్! ఈ మూడ్‌లో ఉండగానే సమాధానం వ్రాసేస్తాను." అంటూ లెటర్ వ్రాయడానికి ఉద్యుక్తులయ్యారాయన.

జగన్నాథంగారు తన అనుభవాలు చెబుతూ వ్రాస్తున్న ఉత్తరం ప్రకాశంగారి ఛలోక్తులతో, మరిన్ని విజ్ఞాన విషయాలు సంతరించుకున్న అస్త్రంలా సిద్ధమైంది చివరకు.

★★★

అంతవరకూ రానివారు హఠాత్తుగా మనుమలిద్దరితో సహా ప్రత్యక్షమైన కొడుకు, కోడల్ని చూసాస్తానే జగన్నాథంగారు ఉప్పొంగిపోయారు.

కానీ నెలరోజుల తర్వాత తండ్రిని చూస్తున్న ఆనందం లేకపోగా కార్తీక్ గంటు పెట్టుకున్న ముఖంలో అసహనంగా ఉన్నాడు.

"బాగున్నారా మావయ్యా!" ముభావంగా పలకరించిన కోడల్ని, కొడుకునీ మార్చిమార్చి చూశారు.

మనవలిద్దరినీ దగ్గరకు తీసుకొని నుదుట ముద్దాడి "బాగా చదువుతున్నారా నాన్నా!" అని ఆప్యాయంగా పలకరిస్తుంటే ఆయన కళ్లనుండి ఆనందబాష్పాలు రాలాయి.

అదే అదనుగా మోచేత్తో భార్య పొడిచిన పోడుపుకి స్పృహలోకి వచ్చినవాడిలా అడిగాడు కార్తీక్!

"మీరు తావుల ఉత్తరాలు వ్రాసి వాళ్ల టైం అంతా పాడుచేస్తాంటే చదువేం చదువుతారు నాన్నా! వాళ్లకి మీరు తిరిగిన ప్రదేశాలూ, అక్కడి విశేషాలూ చాటభారతమంత ఉత్తరాలు వ్రాయడం ఎందుకు? వాళ్లేమో కాన్వెంట్లో చదవడం మానేసి అందరితోటి కూర్చుని ఇవే చర్చలట. 'ఈసారి రాంక్ తగ్గిపోయిందేమిటా' అని వాళ్ల అమ్మ ఆరా తీస్తే ఇదీ విషయం. మీరిక నుంచి వాళ్లకి ఉత్తరాలు వ్రాయడానికి వీలులేదు. ఇంట్లో వాళ్లు అస్తమానూ మిమ్మల్ని పట్టుకుని వ్రేలాడుతున్నారనే కదా మిమ్మల్ని ఇక్కడ చేర్పించింది. పోనీ వాళ్లని దూరంగా ఏదైనా హాస్టల్లో చేర్పించేయమంటారా? చెప్పండి!" కఠినంగానే అడిగాడు కార్తీక్.

"వద్దురా కార్తీక్! బిడ్డకు దూరం ఆయన బాధ ఏమిటో నాకు తెలుసు. ఆ బాధ నీకూ కలగాలని కోరుకునేటంత దుర్మార్గుడిని కాదు. నీ బిడ్డల పట్ల నీ ప్రేమ ఎలాంటిదో నాకు బాగా తెలుసు. ఇక ఏనాడూ నీ పిల్లలకు ఉత్తరం వ్రాయను. నీమీద ఒట్టు. సరేనా!" ఆయన మాటలు ఆయన పడుతున్న అంతర్గత వేదనకు ప్రతిరూపంగా ఉన్నాయి. కళ్లల్లో ఎంత వద్దనుకున్నా నీళ్ల తిరిగాయి.

"సరేగాని! మీ ఆరోగ్యం ఎలా ఉంటోంది మామయ్యా!" అడిగింది కిరణ్మయి.

"బాగానే ఉంటోందమ్మా! అయినా మీ అత్తయ్య ఉన్నప్పుడు ఉన్నట్టుగా ఎలా ఉంటుందమ్మా ఆరోగ్యం? ఏదో ఇక్కడ అందరూ మంచివాళ్లు కాబట్టి కాలం వెళ్లబుచ్చుతున్నాను. భార్యపోయిన మగవాడు జీవచ్ఛవంతో సమానం. నా భార్య పట్ల నాకు నిజమైన ప్రేమలేదేమో! అదే ఉంటే ఆమె మరణించిన మరుక్షణం నేనూ పోయివుండేవాడిని. మీ అందరికీ నాశ్రమ తప్పేది" అన్నారాయన గాద్గదికంగా.

"ఏదైనా అంటే ఇదోటి! అంతంత పెద్దమాటలెందుకు నాన్నా! ఇప్పుడు నీకేం లోటు జరిగిందని? మాకెవరికీ ఖాళీలేకే కదా నిన్ను ఇక్కడ ఉంచాల్సివచ్చింది." నిష్టూరంగా అన్నాడు కార్తీక్.

"అవునురా! ఖాళీ ఉండదు. నిజమే! అనుక్షణం రూపాయికి మరో రూపాయి చేర్చుదాం అనుకునేవాడికి ఖాళీ ఎందుకు ఉంటుంది? నాకు తెలియక అడుగుతాను. నీ మనుమలు కూడా ఉద్యోగం చేయకుండా సుఖంగా కూర్చుని తినగలిగేటంత ఆస్తి ఉన్నప్పుడు ఇంకా ఎందుకురా సంపాదన? మనిషి సంతృప్తికి అంతం ఎక్కడ? అటువంటప్పుడు అమ్మాయినైనా సుఖంగా బ్రతకనీయక ఎందుకురా ఉద్యోగం పేరుతో ఆమెను ఇబ్బంది పెడతావు!"

"చూడండి నాన్నా! డబ్బు ఎవరికీ చేదుగాదు. మీ కొడుకుగా మీరు సంపాదించి నాకు ఇచ్చినట్టే నా పిల్లలకు ఇవ్వాలని నాకూ ఉంటుంది. వాళ్లు సుఖంగా ఉండడానికే నా ఈ ప్రయత్నమంతా! ఇక మీ కోడలంటారా? తనకి కూడా కాలక్షేపం కావాలి కదా ఇంట్లో. తను చదువుకున్న చదువుకు తగ్గ ఉద్యోగం కాకపోయినా ఎవరూ గవర్నమెంట్ జాబ్‌ను వదులుకోరు. అయినా సిరిరా మోకాలడ్డు తారా ఎవరైనా?"

"చూడబ్బాయ్! నీతో నేను వాదించలేను. చదువుకున్న ప్రతీ ఆడదీ ఉద్యోగమే వెలగబెడుతోందా? అయినా మీ అభిప్రాయాలు మీవి. మా మాటలు మీకు ఎక్కడ చెవికెక్కుతాయి గనక! నా బాధంతా ఏమిటంటే పిల్లల మనసు తెలుసుకుని వారి అభిరుచికి తగ్గ చదువు చదివేలా పెంచమని. అయితే వారికి అసలు ఏ అభిరుచి ఉందో కూడా తెలుసుకోలేని స్థితిలో ఉన్న భార్యాభర్తలకు నాబాధ అర్థం కాదురా. అది నీకు అర్థం కావాలంటే...! ఉండు!"

జగన్నాథంగారు లేచి తన పెట్టె దగ్గరగా వెళ్లి దాన్ని తెరిచారు. దానిలో ఆయన బట్టల అడుగున భార్య తాలుకు చీర మడతల్లో అతిభద్రంగా దాచిన ఒక పెద్ద పేకెట్ పట్టుకొచ్చి కొడుకు చేతికి ఇచ్చారు.

"దీన్ని ఇంటికి వెళ్లాక ఓపెన్ చెయ్యి. నా భావం అర్థం అయితే సరే. లేకపోతే వెంటనే దాన్ని తగలబెట్టెయ్యి! మళ్లీ విజిటింగ్ అవర్ టైం అయిపోతే ఇబ్బంది పడతారు వెళ్లిరండి నాయనా!" అన్నారు.

మనుమలు వెనక్కి వెనక్కి తిరిగి చూస్తూ వీడ్కోలు చెప్పి వెళ్లిపోతుంటే ఆయనకు భార్య అనసూయ గుర్తుకొచ్చింది.

"నీ దగ్గరకు తొందరగా వచ్చేయాలని ఉంది అనసూయా. నన్ను తొందరగా రప్పించమని దేవుడికి రికమెండ్ చెయ్యవూ?" అనుకున్నారు మనసులో ఆర్తిగా.

వెళ్లలేక వెళ్లలేక వెళ్తున్న మనుమలకు వీడ్కోలు చెబుతున్నట్టుగా ఆయన చెయ్యితోపాటు మనసు కూడా ఊగిసలాడుతూనే ఉంది అయోమయంగా!

★★★

వారం రోజుల వరకూ పనుల తొందరవల్ల తండ్రి ఇచ్చిన ప్యాకెట్‌ను కనీసం విప్పి చూడాలని స్ఫురించనేలేదు కార్తీక్‌కి.

ఆరోజు ఆదివారం.

తలనొప్పిగా ఉందని కిరణ్మయి టాబ్లెట్ వేసుకొని పడుకుంది.

"తాతగారిచ్చిన ప్యాకెట్ విప్పి చూపించండి డాడీ!" అని పిల్లలు అడగడంతో గ్రాడెజ్ బీరువాలో ఉంచిన ప్యాకెట్‌ను తీసుకొని పిల్లలతో తన రూంలో సోఫాలో కూర్చున్నాడు కార్తీక్.

ప్యాకెట్ విప్పాడు.

అందులో మూడు వస్తువులున్నాయి. మొదటిది సుమారు నాలుగు వందల ఫోటోలకు పైగా ఉన్న ఆల్బమ్. ప్రతీ పేజీ తిప్పుతుంటే అతని కళ్లు పత్తికాయల్లా విచ్చుకోసాగాయి సంభ్రమాశ్చర్యాలతో.

అవన్నీ తన ఫోటోలే! నేలమీద బోర్లాపడినప్పటినుంచి పెళ్లి వరకూ ఎన్నో ఎన్నో ఫోటోలు. అన్నీ తనను కేంద్రంగా చేసి తీసినవే. దానిని పిల్లలకు ఇచ్చి రెండవదాన్ని ఓపెన్ చేశాడు. అది ఒక వీడియో క్యాసెట్.

వి.సి.ఆర్. ఆన్ చేసి క్యాసెట్ ప్లే చేశాడు.

హాస్పటల్‌లో పుట్టిన దగ్గర నుంచి పదవ పుట్టినరోజు వరకూ ప్రతీ బర్త్‌డే పార్టీ చక్కగా చిత్రీకరించబడింది. తన నామకరణ మహోత్సవం, అక్షరాభ్యాసం తీరికవేళల్లో తండ్రి తనతో మాట్లాడుతున్న దృశ్యాలు, తాను తండ్రిని ఇంటర్వ్యూ చేస్తున్నట్లు ఎన్నో ఎన్నో సన్నివేశాలు హృద్యంగా తీయబడ్డాయి. తాము తిరిగిన పుణ్యక్షేత్రాలు, అద్భుతమైన సీనరీస్‌లో తను ఉండగా వినూత్నరీతిలో తీసిన వీడియో క్యాసెట్ అది.

తనకు తెలియకుండానే అతని కళ్లు సెలయేళ్లై ప్రవహించసాగాయి.

''అదేంటి డాడీ ఏడుస్తున్నారెందుకు?'' కుర్రవాడి మాటలతో కళ్లు తుడుచుకుని మూడవ వస్తువు విప్పాడు.

అందులో ఓ ఉత్తరం! ఇలా సాగింది...

"బాబూ కార్తీక్!

నీలో ఏదో మార్పు ఆశించి ఇది నీకు వ్రాస్తున్నాననుకోకు. నేను ఇవన్నీ నీకు సాక్ష్యాలుగా చూపించడానికి తీసుకోలేదు. తీయించలేదు. కేవలం నా సంతృప్తి కోసం. నా బిడ్డ పట్ల నేను చూపించవలసిన ప్రేమ, డబ్బు యావలో పడి ఎక్కడ మర్చిపోతానో అన్న భయంతో తీసుకున్నవి. 'జీవితంలో ఉన్నత స్థితిలో ఉండగా నా తండ్రి నన్ను చూసి ఆనందించాలి. నా నుదుట పుత్ర ప్రేమతో చుంబించాలి' - అని తపన పడ్డాను. నా ఆశ తీరకుండానే ఆయన కాలం చేశాడు. ఆ లోటు నా బిడ్డకు రాకూడదన్న ప్రయత్నరూపమే ఇదంతా!

నీ చిన్నప్పుడు విజయవాడ నుండి విశాఖపట్నం వరకు నా జాబ్‌లో రోజూ రైలుమీద ప్రయాణిస్తూ ఉండేవాడిని. వారానికి అయిదురోజులు క్యాంపులే. నీ ఆటపాటలు, అల్లర్లు అనుక్షణం నాకు ఖాళీ అయినప్పుడల్లా చూసుకోవడం కోసం, కేవలం నాకోసం తీసి దాచుకున్న తీపిజ్ఞాపకాలు అవి. నీ నుండి నన్ను విడదీస్తుంటే నేను భరించలేకపోతున్నానురా. నీ పట్ల పుత్ర ప్రేమతో మరోబిడ్డ కలిగితే నా ప్రేమను వాడికి పంచి ఇవ్వాల్సి వస్తుందని నిన్ను నిన్నుగా ప్రేమించడం కోసం నేను, నిన్ను మీ అమ్మ కన్న మరునాడే వేసక్టమీ ఆపరేషన్ చేయించుకున్నాను. నీ ఇంట్లో స్టోర్‌రూంలో పడేసినా చాలు. నా తనువు ఉన్నంతకాలం కళ్లముందు నువ్వు మసలుతుంటే చూసే అదృష్టం నాకివ్వు బాబూ! ఆపైన నీ ఇష్టం. వీటిని నన్ను ఓల్డేజ్ హోమ్‌లో చేర్పిననాడే ఇద్దామనుకున్నాను. నాకు తెలుసు. నా జీవితంలో ఇలాంటి రోజు వస్తుందని. అందుకే ఇది వ్రాసి దాచుకుంటున్నాను. ఉంటాను బాబూ! నువ్వెక్కడున్నా నా ఆత్మ నీ క్షేమాన్ని మాత్రమే ఆకాంక్షిస్తూ ఉంటుంది. ఇవేవైనా నిన్ను బాధపడితే మరుక్షణం వాటిని దగ్ధం చేసేయి ఉంటాను.

ప్రేమతో, నీకన్న తండ్రి!''

ఆ ఉత్తరం చదివిన కార్తీక్ ఒక్క ఉదుటున లేచి బాత్‌రూంలో దూరి తలుపు వేసుకొని వెక్కివెక్కి గుండెలవిసేలా రోదించాడు.

"నాన్నా! ఈ బిడ్డ పట్ల మీ ప్రేమను గుర్తించలేకపోయాను. క్షమించమని అడగడానికి కూడా నాకు అర్హతలేదు. ఇప్పుడే

మిమ్మల్ని నాదగ్గరకు తెచ్చేసుకుంటాను నాన్నా! మీకేనాడు క్షోభ కలిగించనని అమ్మమీద ప్రయాణం చేస్తున్నాను. ఇప్పుడే వస్తున్నాను నాన్నా!"

అలా ఎంతసేపు ఉన్నాడో అతనికే తెలియదు. పిల్లలు బాత్‌రూం తలుపు కొట్టేసరికి గబగబా ముఖం కడుక్కుని ప్రసన్న వదనంతో బయటకి వచ్చాడు.

"డాడీ! ఎక్కడికైనా వెళ్తున్నారా!" ఫ్రెష్‌గా ముఖం కడుక్కున్న తండ్రిని చూసి అడిగాడు పెదబాబు.

"అవునమ్మా! అమ్మ లేచేలోపల మనం తాతగార్ని ఇంటికి తెచ్చేసి అమ్మని సర్‌ప్రైజ్ చేసేద్దాం. ఆఁ! అన్నట్టు మీరు నాకో ప్రామిస్ చెయ్యాలి! చేస్తారా!" అడిగాడు కార్తీక్.

"ఏమని డాడీ!" చినబాబు అడిగాడు.

"ఇక ఎప్పుడూ నన్ను 'డాడీ' అని పిలవమని! 'నాన్నగారూ' అని పిలుస్తామని!"

"సరే నాన్నగారూ!" ముక్తకంఠంతో అంటున్న బిడ్డలనుదుట ప్రేమతో చుంబించిన కార్తీక్ బైక్ తాళాలు తీసుకొని తేలికపడ్డ మనసులో ఆనందంగా పిల్లల్ని తీసుకొని తండ్రి ఉన్న ఓల్డేజ్ హోమ్ వైపు బయల్దేరాడు.

ఇప్పుడతను 'కడిగిన ముత్యం'లా ప్రకాశిస్తున్నాడు. ●

ఆంధ్రప్రభ సచిత్ర వారపత్రిక
20-07-2002